ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -109 | గురువారం 6 ఆగస్టు 2026

## మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ



2లో.

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..

విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష

రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం

ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు

మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి

ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

**అమరావతి, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):** సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు**మిగతా 2లో...**



# డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు

విశాఖలో సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



**విశాఖపట్నం, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
: ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోందన్నారు.**మిగతా 2లో...**

## సీమ అవసరాలకు శ్రీశైలం నీరు

2027 జూన్ వరకు భద్రపరచుకోవాల్సిందే

నీటిని విడుదల చేసినట్లు వెల్లడించిన మంత్రి నిమ్మల



**అమరావతి, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలని అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టీఎంసీలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టీఎంసీల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్‌నినో దృష్ట్యా ప్రథమ**మిగతా 2లో...**

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన

సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య

ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం

ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.




# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

## : కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

**దేవరపల్లి ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని **మిగతా 2లో...**



## న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదా రూపకల్పనకు గ్రీన్ సిగ్నల్

న్యాయ కార్యదర్శిని ఆదేశించిన న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం- మంత్రి ఫరూక్ స్పష్టీకరణ



2లో.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..



తుమ్మడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

అటవీ పర్యావరణ అనుమతలుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్టాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**న్యూఢిల్లీ,ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

## రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు**మిగతా 2లో...**



## అమెరికాలో భారతీయుల ఘనత..

'ఇండియా డే'గా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!

ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన

బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డే'గా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం **మిగతా 2లో...**



# సీమ అవసరాలకు శ్రీశైలం నీరు

**మొదటిపేజీ తరువాయి**

ప్రాధాన్యంగా తాగునీటికి విడుదల చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు అవసరమని మంత్రి వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం10 టీఎంసీలను రేపటి నుంచి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటికై 10 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉందన్నారు. నాగార్జున సాగర్, రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి తాగునీటికి 32 టీఎంసీలు అవసరమన్నారు. వారం, వారం సమీక్ష చేసుకుని ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే విధంగా వర్షాలు, వరదల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ నీటి భద్రతకు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.
గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

# అమెరికాలో భారతీయుల ఘనత..

**మొదటిపేజీ తరువాయి**

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్-అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై 'ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్' (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదా రూపకల్పనకు గ్రీన్ సిగ్నల్

**న్యాయ కార్యదర్శిని ఆదేశించిన న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం- మంత్రి ఫరూక్ స్పష్టీకరణ**

**అమరావతి, ఆగస్టు05 (రిపబ్లిక్ న్యూస్) :**



ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026( ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్ -2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ చర్యలకు ఉపక్రమించింది.
ముసాయిదాను వీలైనంత త్వరగా తయారు చేయాలని న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం తో యుద్ధ ప్రాతిపదికన చర్చించి ముసాయిదా రూపకల్పనకు కార్యాచరణ చేపట్టాలని న్యాయశాఖ కార్యదర్శి కి సూచన చేసినట్లు మంత్రి ఫరూక్ బుధవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.
ముసాయిదా బిల్లు తయారైన వెంటనే తదుపరి చర్యల కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తో పాటు ఆర్థిక శాఖ రిమార్కులను పరిగణలోకి తీసుకొని బిల్లు ఆమోదం కోసం మంత్రి మండలి సమావేశం ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని మంత్రి తెలిపారు.న్యాయవాదు ల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ప్రకారం మొత్తం రూ. 46.92 కోట్లు ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

# రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

## డయల్ 112తో అన్ని సేవలు




తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

**మొదటిపేజీ తరువాయి**

150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్వీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

# డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

**మొదటిపేజీ తరువాయి**

సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎ÷-లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

**విశాఖపట్నం, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**

ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. "పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో 'కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు' అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం" అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.
ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం" అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. "కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. "ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ స్టేడియంలో మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. 'సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను' అని ప్రతి బిడ్డ నమ్మాలి" అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..

**మొదటిపేజీ తరువాయి**

. ఈసందర్భంగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ.3.50 నుంచి రూ.4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించేలా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు. రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు.. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖ రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని.. ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ ఉండాలన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలన్నారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు. నిధుల కన్వర్జ్గ÷న్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలన్నారు.

# మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

**రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ**

**ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి**

**ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు**

**ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన**

**దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది.
రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.
స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.
ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.
మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.
అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.
జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# చౌడేపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై ఎంపీ పీవీ మిథున్ రెడ్డిని కలిసిన మిద్దింటి కిషోర్



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 05 రిపబ్లిక్ న్యూస్**
దేశ రాజధాని న్యూఢిల్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, యువజన విభాగం చేపట్టనున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. అలాగే పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీ పీవీ మిథున్ రెడ్డిని మిద్దింటి కిషోర్ కోరారు. చౌడేపల్లి మండల విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ అంశంపై ఎంపీ పీవీ మిథున్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు మిద్దింటి కిషోర్ వెల్లడించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత స్థాయిలో కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైనవి





**ఆళ్లగడ్డ ఆగష్టు 5 రిపబ్లిక్ న్యూస్ :**ఆళ్లగడ్డ పట్టణం లోని 15వ అంగన్వాడీ కేంద్రం లో బుధవారం తల్లిపాల వారోత్సవాల అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గర్భవతులు, భాలింతలు, పిల్లలతల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త జి. అరుణ కుమారి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు సంజీవిని లాంటివని, బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, 6నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, తల్లి పాలలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందని, తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమైన వని, తల్లిపాల వలన తల్లికి బిడ్డకు మధ్య అనుబంధం ఎర్పడుతుందని, పిల్లలకు తల్లిపాలే ఇవ్వాలని ఇతర ద్రవ పదార్థాలు కానీ, డబ్బాపాలు కానీ, మంచినీరు కానీ తాపవద్దని, డబ్బాపాల వలన తరచుగా వాంతులు, విరేచనాలతో జబ్బుల బారిన పడతారని కావున పిల్లలకు తల్లి పాలే ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ వర్కర్ జి అరుణ కుమారి, హెల్పర్ జయలక్ష్మి, ఆశా వర్కర్ పద్మావతి పాల్గొన్నారు.

# చంద్రబాబుకు గుమ్మనూరు జయరాం, పూల నాగరాజు వివాహ ఆహ్వానం



**గుంతకల్, ఆగస్టు 5 (రిపబ్లిక్ న్యూస్)**గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు పూల నాగరాజు కుటుంబ సమేతంగా విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 30న జరగనున్న తమ కుటుంబాల్లోని వివాహ శుభకార్యానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.
గుమ్మనూరు జయరాం కుమార్తె, పూల నాగరాజు కుమారుడి వివాహం ఈ నెల 30న జరగనుంది. ఈ నేపథ్యంలో విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.
ఈ సందర్భంగా చంద్రబాబు వివాహానికి హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేసి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మనూరు జయరాం తనయుడు, గుత్తి, పామిడి మండలాల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, జయరాం కుటుంబ సభ్యులు, పూల నాగరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టుపై వైఎస్సార్సీపీ నేతల ఆగ్రహం

**రాజకీయ కక్షసాధింపుతో అక్రమ అరెస్టు చేశారని ఆరోపణ**

**తప్పుడు కేసులు ఉపసంహరించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 5)**
ఆలూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులో భాగంగా అక్రమంగా అరెస్టు చేసిందని వైఎస్సార్సీపీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను తప్పుడు కేసులతో వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇది ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఈ సందర్భంగా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు, జిల్లా కార్యదర్శి అశోక్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ యాదవ్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు బబ్లు, వాల్మీకి నాయుడు, కప్పట్రాళ్ల రాజశేఖర్, కర్నూలు మండల యువజన అధ్యక్షుడు కోట్ల మధు కుమార్, వాల్మీకి తిరుమల నాయుడు, ఎదురూరు వాల్మీకి శివ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షిని లక్ష్యంగా చేసుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి అరెస్టులకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ఇటువంటి కక్షసాధింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్సార్సీపీ తన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే విరూపాక్షిపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకుని, ఆయనను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు.

# ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.





**ఆళ్లగడ్డ ఆగష్టు 5 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని టిడ్కో గృహాలను సందర్శించి మన భూమా -మన ధీమా కార్యక్రమం తో పాటు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ. మంగళవారం రోజు ఉదయం 7గంటల సమయం లో ఆళ్లగడ్డ పట్టణం లోని టిడ్కో గృహాలను ఎమ్మెల్యే సందర్శించారు టిడ్కో గృహాలలో ప్రతి వీధికి వెళ్లి ప్రజలను నేరుగా కలిసి వారి సమస్య లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.
ఈ ప్రాంతానికి ఎన్నిసార్లు వచ్చినా ప్రజలు ప్రధానంగా మెయింటెనెన్స్ సమస్యలు, డ్రైనేజీ, రోడ్లు, అప్రోచ్ రోడ్లు, తాగునీటి సౌకర్యాల గురించి ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఅని
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ గృహాల్లో నాణ్యత లోపాల కారణంగా పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారని.
వాస్తవానికి టిడ్కో హౌసెస్‌ను గతంలో చంద్రబాబు నాయుడు పట్టణాల్లో స్థలం లేని నిరుపేదలకు సొంత నివాసం కల్పించాలనే లక్ష్యంతో నిర్మించారని. అయితే గత ప్రభుత్వంలో అర్హత లేని వారికి ఇళ్లు కేటాయించడం, కొందరు ఇళ్లను అద్దెకు ఇవ్వడం, మరికొందరు రెండు మూడు ఇళ్లు కలిగి ఉండటం వంటి అక్రమాలు జరిగినట్లు ప్రజలు ఫిర్యాదు చేశారని. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పూర్తిగా నమోదు చేసి జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తామని . డ్రైనేజీ, రోడ్లు, అప్రోచ్ రోడ్లు వంటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని.
మధ్యలో నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ పనులపై కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని చెప్పామని.
టిడ్కో హౌసెస్ నిర్వహణ బాధ్యత మున్సిపాలిటీదా లేక టిడ్కో సంస్థదా అనే అంశంపై ఉన్న సందిగ్ధతను కూడా సంబంధిత మంత్రితో చర్చించి స్పష్టత తీసుకుని, శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని.
మహిళల భద్రత విషయంలో కూడా ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారని బయట ప్రాంతాల నుంచి వచ్చిన కొందరి అసాంఘిక కార్యకలాపాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని. ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా అవసరమైన ప్రాంతాల్లో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌తో మాట్లాడతామని .నిధుల సమస్య ఉంటే మా వంతుగా సహకరించి కెమెరాలు ఏర్పాటు చేస్తామని. అదే విధంగా టిడ్కో ఇళ్లను షాపులుగా లేదా ఇతర వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న వారికి ఇప్పటికే అధికారులు నోటీసులు జారీ చేశారని. అలాగే ఇతర ప్రాంతాల్లో సొంత ఇళ్లు ఉన్నవారు కూడా టిడ్కో ఇళ్లను ఆక్రమించి ఉంటే స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని. లేదంటే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని.
ఎందుకంటే నిజంగా ఇల్లు లేని నిరుపేదలకు, ఇంకా నివాసం కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ఈ గృహాలు అందేలా చేయడం మనందరి బాధ్యత. అందువల్ల రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ కిషోర్, సిబ్బంది పట్టణ సి ఐ జి. నాగరాజారావు, సిబ్బంది, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ హుస్సేన్ బాషా, నాగంజి, శేకర్ రెడ్డి, భాస్కర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీ ని విజయవంతం చేయండి.. : గంగుల

**6నుండి 9వరకు రిలే నిరాహార దీక్షలు**

**10వ తేదీ భారీ ర్యాలీ**





**ఆళ్లగడ్డ ఆగష్టు 5 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని వైస్సార్ సి పి కార్యాలయం లో మంగళవారం ఉదయం గంగుల బ్రిజేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయుకులు, పట్టణ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల బ్రిజేంద్ర రెడ్డి మాట్లాడుతూ
వైఎస్ఆర్ కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు శ్రీ. వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి హామీలలో గడిచిన రెండేళ్ల లో ఫీజు రీయింబర్స్ మెంట్, నిరుద్యోగ భృతి బకాయిలు వెంటనే విడుదల చేయాలని మరియు డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సిబిఐ ఎంక్వైరీ జరిపి దీనికి సంబంధించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నైతిక భాద్యత వహిస్తూ వెంటనే అతని పదవికి రాజీనామా చేయాలని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ప్రజల కిచ్చిన 6 హామీల అమలుపై అలాగే DSC లో జరిగిన అక్రమాలపై వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 06.08.2026 నుండి 09.08.2026 వరకు రిలే నిరాహార దీక్ష కార్యక్రమాలు చేపడతామణి మరియు 10.08.2026 వ తేదీన భారీ ర్యాలీ ని నిర్వహిస్తామని ఈ కార్యక్రమాలన్నీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయవలసినదిగా కోరారు ఈ సమావేశం లో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి,ఆళ్లగడ్డ మండలాధ్యక్షుడు గజ్జెల. రాఘవేంద్రారెడ్డి, సింగం. వెంకటేశ్వరరెడ్డి, తోడేండ్ల పల్లి. వీరభద్రుడు, క్రిష్ణయ్య యాదవ్, కుమార్ రెడ్డి,సలాం, కులూరు. నరసింహ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రమేష్ గౌడ్,పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18 ఏళ్లుగా.. ఇళ్ల పట్టాలకు మోక్షం ఏదీ?

**గుత్తి, ఆగస్టు 5: (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి పట్టణంలోని జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల పట్టాల సమస్య 18 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంపై పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరించి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం గుత్తి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

**18 ఏళ్లుగా ఎదురుచూపులే..**
గుత్తి పట్టణంలోని విలేకరులకు గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు కేటాయించినప్పటికీ, వాటిపై నెలకొన్న వివాదాలు, న్యాయపరమైన అంశాల కారణంగా ఇంతవరకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరలేదని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం బాధాకరమన్నారు.

**ప్రభుత్వ భూమిని రక్షించి.. జర్నలిస్టులకు న్యాయం చేయాలి**
గతంలో సంబంధిత భూమిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు కేటాయించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. అయితే అనంతరం తలెత్తిన వివాదాలతో వ్యవహారం కోర్టు పరిధికి వెళ్లడంతో సమస్య మరింత జటిలమైందన్నారు. ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులు, వివిధ శాఖల నుంచి



సేకరించిన సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు.

**అధికారుల నిర్లక్ష్యమే కారణమా?**
భూమి వ్యవహారంలో గతంలో జరిగిన పరిణామాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. న్యాయస్థానంలో ప్రభుత్వ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా వాదనలు వినిపించారా? లేదా? అన్న అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రభుత్వానికి సంబంధించిన భూమిని పరిరక్షించడంతో పాటు అర్హులైన జర్నలిస్టుల హక్కులను కాపాడేందుకు అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

**తహసీల్దార్ పరిశీలించినా..**
ఇటీవల ప్రస్తుత తహసీల్దార్ సంబంధిత స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాకపోవడంపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు తక్షణమే నిర్ణయం తీసుకుని ఇళ్ల స్థలాల సమస్యకు ముగింపు పలకాలని కోరారు.

**ఇకనైనా న్యాయం చేయాలి**
జిల్లాలోని పలు ప్రాంతాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహాల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ గుత్తిలో మాత్రం 18 ఏళ్లుగా సమస్య కొనసాగడం విచారకరమన్నారు. అర్హులైన జర్నలిస్టులను గుర్తించి వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలను సక్రమంగా అందించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాల ద్వారా ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని కోరారు.
ఎన్నో ప్రభుత్వాలు మారినా తమ సమస్య మాత్రం పరిష్కారం కాలేదని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి రికార్డులను పరిశీలించి, న్యాయపరమైన అంశాలను పరిష్కరించి, 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల వ్యవహారానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో తస్నీరు శ్రీనివాసులు, గోవిందరాజులు, బాచి మస్తానప్ప, రమేష్, విశ్వనాథ్ ,రామకృష్ణ, రంగా, నాగరాజు,రఫీ, ఖాదర్ భాష, రాజు సునీల్ భాష, మోహన్ బాబు, నరసింహులు,పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గంజాయి సరఫరా మరియు అమ్మకానికి పాల్పడిన నిందితునికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ.10,000/- జరిమాన

**విధించిన 1వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి శ్రీమతి జి. సునీత రవీంద్ర రెడ్డి**

**నిషేధిత గంజాయి పెంపకం, సరఫరా మరియు అమ్మకానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్**

**మల్లాపూర్ ఆగష్టు 5 (రిపబ్లిక్ న్యూస్)**
గంజాయి సరఫరా అమ్మకానికి పాల్పడిన నిందితుడు రావులకరి నితిన్ (21) రేగుంట గ్రామనికి చెందిన వ్యక్తిపై మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో గౌరవ న్యాయస్థానం 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాలోనికి వెళ్తే మార్చి 23, 2024న ఉదయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్పటి మల్లాపూర్ ఎస్సై పి. కిరణ్ తన సిబ్బందితో కలిసి గొర్రెపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రేగుంట గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించడంతో అనుమానించి అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, నిందితుడి వద్ద ఉన్న సంచిలో సుమారు 4 కిలోల గంజాయి లభ్యమైంది. విచారణలో నిందితుడు రావులకరి నితిన్ (21), రేగుంట గ్రామం, మల్లాపూర్ మండలంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గత ఏడాది కాలంగా గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు, రాయికల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి మల్లాపూర్ మండలం పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు విచారణలో తెలిసింది. మాదకద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం నిందితుని వద్ద ఉన్న గంజాయిని, సెల్‌ఫోన్, బైక్ ను స్వాధీనం చేసుకుని, పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసిన అప్పటి ఎస్.ఐ కిరణ్ కుమార్, మెట్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను గౌరవ న్యాయస్థానంలో దాఖలు చేశారు. దర్యాప్తు సందర్భంగా సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఫోరెన్సిక్ నివేదికలను గౌరవ న్యాయస్థానంలో సమర్పించడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నేడు గౌరవ 1వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి నిందితుని దోషిగా నిర్ధారించి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.10,000/- జరిమానా విధించారు. జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరా మరియు అమ్మకాలపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి పెంపకం, రవాణా, నిల్వ, సరఫరా మరియు అమ్మకాల వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చీణూూ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితులకు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడం పోలీస్ శాఖ సమర్థవంతమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సమర్పణకు నిదర్శనమని తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి జగిత్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎస్.ఐ కిరణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య, సి.ఎం.ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ రంజిత్ , సి.ఎం.ఎస్ కానిస్టేబుళ్లు రాజులను ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.

# సేవలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలి

## డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్ చైర్మన్ : రెడ్‌క్రాస్ సొసైటీ..- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సభ్యులు

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 05,(రిపబ్లిక్ న్యూస్):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్ చైర్మన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అనంతపురం జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతనంగా ఎన్నికైన సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఓ. ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా శాఖ పాలకసమితి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఏప్రిల్ 29న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల అధికారి జి. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వార్షిక సర్వసభ్య సమావేశంతో పాటు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. కార్యవర్గ సభ్యుల పదవులకు నాలుగు ప్యానెల్‌ల నుంచి 44 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అయితే సేవా సంస్థలో ఎన్నికల కంటే ఏకాభిప్రాయానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న రాష్ట్ర రెడ్‌క్రాస్ శాఖ, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అన్ని ప్యానెల్‌లతో చర్చలు జరిపి 11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

**నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం**

నూతన కార్యవర్గంలో డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్ చైర్మన్‌గా,



ప్రొఫెసర్ డా. గీతా బాల వైస్ చైర్మన్‌గా, సుంకర రమేష్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. సభ్యులుగా డా. కె. లక్ష్మీనారాయణ, ఎం.జి. ఎరన్న, డా. ఓ. మనోరంజన్ రెడ్డి, ఆలంబన జనార్ధన్, భిసతి భరత్, దాసరి భరత్ కుమార్, వి.కె. శ్రీవాణి, విష్ణుప్రియ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయగా, ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ అధికారికంగా ధృవీకరించారు.

**త్వరలోనే జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సందర్శిస్తా**

ఈ సందర్భంగా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ వైద్య, విద్య, వ్యాపార, సామాజిక సేవ తదితర రంగాలకు చెందిన అనుభవజ్ఞులు కార్యవర్గంలో చోటు దక్కించుకోవడం అభినందనీయమన్నారు. సమిష్టి



భావంతో పనిచేస్తూ రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ నెల 30న నిర్వహించనున్న 'చేయూత' ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలోనే జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రక్తదానం, ప్రథమ చికిత్స శిక్షణ, విపత్తు నిర్వహణ, ఆరోగ్య సేవలు, యువజన సేవా కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమం తదితర మానవతా సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# రాత్రి వేళల్లో కర్నూలు జిల్లాలో విస్తృత విజిబుల్ పోలీసింగ్

**"స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమంతో రహదారి భద్రతపై అవగాహన**

**అనుమానాస్పద వ్యక్తుల సమాచారం కోసం డయల్-112, 100కు కాల్ చేయాలని పోలీసుల సూచన**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 5)** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు పోలీసులు రాత్రి వేళల్లో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టమైన విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించగా, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కూడా చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు విశ్రాంతి తీసుకుని ప్రయాణం కొనసాగించాల్సిన అవసరంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే డయల్–112 లేదా డయల్–100కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు ప్రజలను కోరారు.

# రైల్వే సమస్యలపై కేంద్ర మంత్రికి ఎంపీ అంబికా వినతి

**వందే భారత్ స్లీపర్, కొండవీడు ఎక్స్‌ప్రెస్ సర్వీసుపై సానుకూల స్పందన**

**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 05,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వే సౌకర్యాల విస్తరణ, కొత్త రైళ్లు, రైళ్ల నిలుపుదల, స్టేషన్ల అభివృద్ధి తదితర అంశాలపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను బుధవారం న్యూఢిల్లీలో కలిసి సమగ్ర వినతిపత్రం సమర్పించారు.

**ఫ్లైఓవర్లు, రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలి**

అనంతపురం, కల్లూరు, గుత్తి, రాయలచెరువు, రాయదుర్గం రైల్వే స్టేషన్లలో పలు రైళ్ల నిలుపుదల కల్పించడం, కొత్త రైలు సర్వీసులు ప్రారంభించడం, రైళ్ల సమయాల్లో మార్పులు చేయడం, అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించడం, రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరారు. గుంతకల్లుబళ్లారి మధ్య మూడు, నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.3,500 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి సోమణ్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లుగా వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17211/17212)ను ప్రతిరోజూ నడపాలని, గుంతకల్లుబెంగళూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం వేళల్లో ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంయశ్వంత్‌పూర్ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను రోజువారీ సర్వీసుగా మార్చాల్సిన అవసరం ఉందని వివరించారు.

**జిల్లాకు ఆధునిక మౌలిక వసతులు అందేలా కృషి చేస్తా**

విజయవాడబెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు విశాఖపట్నంబెంగళూరు వందే భారత్ స్లీపర్ రైలును అనంతపురం మీదుగా నడపాలని టీడీపీ ఎంపీలతో కలిసి రైల్వే మంత్రిని కోరినట్లు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, అక్టోబర్ నుంచి విశాఖపట్నంబెంగళూరు వందే భారత్ స్లీపర్ రైలు ప్రారంభించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఎంపీ వెల్లడించారు. అనంతపురం పార్లమెంట్ పరిధికి సంబంధించిన అన్ని ప్రతిపాదనలను రైల్వే బోర్డు అధికారులతో సమీక్షించి, సాధ్యమైన మేరకు సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. జిల్లాకు మెరుగైన రైల్వే సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు అందేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తూ కృషి కొనసాగిస్తానని అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా అకాడమీలు

**ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న వైనం - విద్యార్థులు భవిష్యత్తులతో చెలగాటం**

**శ్రీ వాణి ఎక్సెల్ అకాడమీపై చర్యలు తీసుకోవాలి -ఆర్ఐఓ కు వైస్సార్సీపీ విద్యార్థి విభాగం వినతిపత్రం**

**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 05,(రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అకాడమీలు నిర్వహిస్తూ ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న విద్యాసంస్థలపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ నేతృత్వంలో ప్రాంతీయ



పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ అనంతపురంలో 'శ్రీ వాణి ఎక్సెల్ అకాడమీ' పేరుతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్మీడియట్ బోధన నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఒక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించి, వేరే ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం, ఫీజులకు రసీదులు ఇవ్వకపోవడం, హాజరు, విద్యా రికార్డుల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తేలితే సంబంధిత విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుని విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. విద్యారంగంలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతంగా పర్యవేక్షణ చేపట్టడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నవీన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శులు ఫయాజ్, మనోజ్, బబ్లు, హరీష్, చరణ్, కార్తికేయ, రఫీ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ




**నంద్యాల బ్యూరో, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాలలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నందు గత 30 రోజుల పాటు జరిగిన "మగ్గం వర్క్ మరియు ఎంబ్రాయిడరీ వర్క్"శిక్షణా కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ శిక్షణలో పాల్గొన్న 33 మంది మహిళలకు ఈరోజు సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి ఆర్ డి ఎ పి డి శ్రీ ధర్ రెడ్డి యూనియన్ బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీ అయ్యప్ప రెడ్డి హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి. అరుణ కుమారి, శిక్షణా కోర్సు కోఆర్డినేటర్ శివ నారాయణ, శిక్షణ ట్రైనర్ ఈశ్వరి, రమేష్ , సంస్థ సిబ్బంది నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# ఇంటింటా కూటమి ప్రభుత్వ సంక్షేమం

**గుత్తి, ఆగస్టు 5: (రిపబ్లిక్ న్యూస్)** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసే లక్ష్యంతో గుత్తి మండలం ధర్మాపురం గ్రామంలో బుధవారం డోర్‌టు–డోర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లిన నాయకులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు



అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు, పథకాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులను సంప్రదించాలని సూచించారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చౌదరి, ఆనంద్, రామాంజనేయులు, సురేంద్ర చౌదరి, వీరాంజనేయులు, సుధాకర్, రామానాయుడు, జగన్నా, నాగేశ్వరావు, పులికొండ పెద్ద రాయుడు, రామచంద్ర, భాస్కర్, శివ, బాల పెద్దరాజు,సింహాద్రితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ దిశగా కర్నూలు అభివృద్ధి : మంత్రి టీజీ భారత్

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు**

**ఘనంగా పుట్టినరోజు వేడుకలు..**

**పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో పాల్గొన మంత్రి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 5)** విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కర్నూలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భారత్ తెలిపారు. మంత్రి టీజీ భారత్ పుట్టినరోజు వేడుకలు కర్నూలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవాదాయ శాఖ గోశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, అనంతరం బుధవారపేటలో స్థానిక నాయకుడు అబ్బాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఎస్.ఏ.పీ క్యాంపు మీదుగా కొత్త బస్టాండ్ వైపు మళ్లించేలా నూతనంగా నిర్మించిన రహదారిని శిలాఫలకం ఆవిష్కరించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కర్నూలు నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించినట్లు పేర్కొంటూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం మంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ప్రభుత్వ



ఆసుపత్రిలో గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేస్తూ మొక్కలు నాటారు. కంటి ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే సిటీ స్క్వేర్ మాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, చల్లా కంపౌండ్‌లో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు.

# ఘనంగా నవోదయ ఫౌండేషన్ డే వేడుకలు

**ఎమ్మిగనూరు , ఆగస్టు 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** బనవాసి పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ ఫౌండేషన్ డే వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని, ఎమ్మిగనూరు తహసీల్దార్ కె. శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ నవోదయ విద్యాలయాలు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి వేదికలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నాయని పేర్కొన్నారు. నవోదయ విద్యార్థులు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ విద్యాలయానికి మంచి పేరు తీసుకొస్తున్నారని అన్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ నవోదయ విద్యార్థులతో మమేకం



కావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో కనిపించే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సేవాభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో నిరంతరం కృషి చేసి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. తమ బాల్య జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని, నవోదయ విద్యాలయంలోని ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం ఎంతో ఆకట్టుకుందని తెలిపారు.



ఈ సందర్భంగా తొలి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రశాంత్, రమేష్ సాగర్, మహేష్ తదితరులు తమ నవోదయ అనుభవాలను పంచుకొని ప్రస్తుత విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. చివరగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# అంగరంగ వైభోగంగా సుంకులమ్మ దేవి 11వ వార్షిక గంగ పూజ




**చిప్పగిరి, ఆగస్టు, 5,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో శ్రీ సుంకులమ్మ దేవి 11వ వార్షిక గంగపూజ మహోత్సవం గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ పెద్దలు యువకులు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు హారతులు సమర్పించి వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా మంత్రి టీజీ భరత్ గుప్తా జన్మదిన వేడుకలు

### .. ప్రభుత్వ ఆసుపత్రికి నాలుగు వీల్‌చైర్ల బహుకరణ



**ఎమ్మిగనూరు, ఆగస్టు 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం నాలుగు వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిళేహాల్ భాస్కర్ శెట్టి, ప్రధాన కార్యదర్శి గ్రంథే వెంకటగిరి, కోశాధికారి రంగయ్య శెట్టి మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి మంత్రి టీజీ భరత్ గుప్తా విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల కోసం అందజేసిన వీల్‌చైర్లు వారికి ఎంతో ఉపయోగపడతాయని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, శ్రీకాంత్, అంజలి రవి, వీరేష్, బాబు, నరేంద్ర, చిన్ని శీను, ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎస్ఎల్ఎన్ టీవీఎస్ షోరూమ్ ప్రారంభం




**ఎమ్మిగనూరు, ఆగస్టు 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు పట్టణంలోని శివ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్ఎన్ టీవీఎస్ షోరూమ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయనాగేశ్వర్ రెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, షోరూమ్ యాజమాన్యం, నిర్వాహకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్త వాణిజ్య సంస్థలు ఏర్పాటు కావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుందని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు, స్థానిక నాయకులు, షోరూమ్ మేనేజర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# వీదుల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించిన పంచాయతీ కార్యదర్శి.



**రైల్వే కోడూరు ఆగస్టు 5 రిపబ్లిక్ న్యూస్.** మండల కేంద్రం లోని పలు ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను మండల అభివృద్ధి అధికారి ఎంవి ఎన్ రాజేందర్ ఆదేశాల మేరకు బుధవారం ఓబులవారిపల్లి కల్లాలమెట్ట ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తన సిబ్బందితో పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ శుభ్రం చేయించారు, వివరాల్లోకి వెళితే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు,పక్క రైల్వే స్టేషన్ పరిసరాల్లోని పేరుకుపోయిన చెత్తను, పోస్ట్ ఆఫీస్, పుటిక వారి పల్లి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర పరిసర ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్యదర్శి తన సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు, అలాగే గ్రామాలలోని ప్రజలు గ్రామంలోకి వచ్చిన ట్రాక్టర్ మరియు సిబ్బంది చెత్తను కలెక్ట్ చేసి గ్రామానికి దూరముగా డంప్ చేయడం వల్ల గ్రామాల్లో పరిశుభ్రమగా ఉండటమే కాకుండా సీజనల్ వ్యాధుల నుండి ప్రజలు రక్షణ పొందవచ్చని చెత్త నిలువ ఉండడం వలన చెప్తా కుళ్ళి దుర్వాసన వెదజల్లడమే కాకుండా గ్రామస్తులకు 10 ఆచార్యులకు ఆటంకముగా వ్యాదులు సోకే ప్రమాదం ఉందని, ఈ నే పద్యంలో గ్రామాలలో చెత్తను సేకరించే వాహనం వచ్చినప్పుడు నిలువ ఉంచిన చెత్తను ట్రాక్టర్లో డంప్ చేయడం వల్ల ఆ చెత్తను పంచాయతీ సిబ్బంది ప్రజలకు గ్రామంలో పిల్లలు పెద్దలు, వృద్ధులు సంచరించడం వల్ల వ్యాధుల సోకే ప్రమాదం ఉందని ఆ చెత్త ఊరికి దూరంగా డబ్బు చేయడం వల్ల గ్రామాలు క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంటాయని కార్యదర్శి శివ ప్రసాద్ అన్నారు, గ్రామస్తులు చెత్తను సేకరించే వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు

# ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి ఏమైనా ఉగ్రవాద

### బాధిత కుటుంబాన్ని అండగా నిలబడడం తప్ప -రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య, మండల కన్వీనర్ మల్లికార్జున




**చిప్పగిరి, ఆగస్టు, 5,( రిపబ్లిక్ న్యూస్ )**
ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మారయ్య గారూమాట్లాడుతూ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇవాళ ఏం జరుగుతోంది? దాడి చేసినవారు అధికారపార్టీ వాళ్లయితే వారికి రక్షణ! దాడికి గురైనవారు వైయస్సార్‌సీపీ వాళ్లయితే వారిపైనే కేసులు ! బాధితులకు అండగా నిలబడితే ప్రజాప్రతినిధులపైనా కేసులు ! ప్రశ్నిస్తే అరెస్టులు ! నిలదీస్తే అర్ధరాత్రి తలుపులు బద్దలుకొట్టడం! ఇదేనా ప్రజాస్వామ్యం?ఇదేనా న్యాయం? ఇదేనా చట్టం చంద్రబాబుగారూడ నేను సూటిగా అడుగుతున్నాను ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? ప్రజల చేత ఎన్నుకోబడిన ఒక ఎమ్మెల్యే అని అన్నారు,
చిప్పగిరి మండలం కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ చిప్పగిరి మండలం నేమకల్లులో వైయస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై టీడీపీవాళ్లు దాడిచేస్తే, తన ప్రాణాలకు ప్రమాదం ఉందని, తన కుటుంబాన్ని కాపాడాలని ఆ నాయకుడు ఎమ్మెల్యే విరూపాక్షి కి కాల్ చేశాడు, ఒక కార్యకర్త ప్రాణభయంతో సహాయం కోరితే స్పందించడం ఎమ్మెల్యే చేసిన నేరమా? బాధిత కుటుంబానికి అండగా నిలబడటం తప్పా? చివరకు పరామర్శించేందుకు వెళ్లిన విరూపాక్షి పై నే టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేశాయి. ఈ ప్రభుత్వంలో దాడి చేసినవారికి రక్షణ లభిస్తోంది. దాడికి గురైన ఎమ్మెల్యే నే నిందితుడిగా మార్చి ఆయన పైన, కార్యకర్తల పైన హత్యాయత్నం కేసులు బనా యిస్తున్నారు అని తెలిపారు,వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు జిఎస్. నెట్టికంటి మాట్లాడుతూ ఒక ఎస్సీ కులం లో పుట్టినా వారిని రాజకీయం గా వాడుకొని లేని పోనీ కట్టు కథలు అల్లి ఒక ఎస్సీ మహిళ పరువు తీస్తున్నారు నిజం ప్రజలు గమనిస్తున్నారు మాఎమ్మెల్యే సౌమ్యుడు ఈరోజు మా గ్రామం లో అయితే నేమి నియోజకవర్గం లో అయితే నేమి అందరూ కుటుంబ సభ్యుల ఉంటాం ఇది రెండు కులాల మధ్య చిచ్చుగా మార్చవద్దు అన్నారు, ఈ కార్యక్రమం లో రాష్ట్ర పంచాయతీ రాజ్ వింగ్ ఉపాధ్యక్షు లుఓబులేసు, మాజీ సర్పంచ్ ఏరూరు సేనాపతి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున,మజీ ఎంపీటీసీ బీమలింగ, కో కన్వీనర్ శేఖర్, సీనియర్ నాయకులు కుందానగుర్తి నాగప్ప, లోకనాథ్ ,ఎరురు జయన్న, కురువ వన్నూరుప్ప, ఆంజనప్ప మనోహర్, దెగులపాడు ఎస్సీ నాయకుడు రాజు ,ఎరూరు శీనా, ఎరూరు ఈశ్వరప్ప, ఏరూరు వెంకటేష్ ,బిల్డోన రాము , బిల్డోనా అంజి, కాజీపురం రాంబాబు, చిప్పగిరి శివ, నేమకల్ భీమలింగ, చెరువు తిమ్మప్ప, ఏరూరు దేవేంద్ర, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వాల్మీకి బోయ లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

### ఎస్టి హోదా వచ్చేవరకు పోరాటం ఆగదు - వాల్మీకి బోయ సమాజ నాయకులు





**చిప్పగిరి,ఆగస్టు, 5,( రిపబ్లిక్ న్యూస్)**
వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు తమ ఉద్యమం ఏ పరిస్థితుల్లోనూ ఆగదని, ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వాల్మీకి బోయ సమాజ నాయకులు ప్రభుత్వాలకు స్పష్టమైన హెచ్చరిక చేశారు. వాల్మీకి బోయలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇకపై సహించబోమని, ఎస్టి హోదా సాధించే వరకు ఉద్యమం మరింత విస్తృత రూపం దాల్చుతుందని ఆలూరు వేదికగా ప్రభుత్వాలకు అల్టిమేటం జారీ చేశారు. వాల్మీకి బోయ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వాల్మీకి యువత మహాసభ బుధవారం ఆలూరు మండల కేంద్రంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు తలారి వాల్మీకి అంజి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా దేవనకొండ మాజీ సొసైటీ చైర్మన్ కప్పట్రాల లక్ష్మి దేవమ్మ, గుమ్మనూరు నారాయణ, హోలగుంద మాజీ సొసైటీ చైర్మన్ మల్లి, రాష్ట్ర బోయ వాల్మీకి సమితి కార్యదర్శి లావణ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు కళావతి, వాల్మీకి బోయ మహిళ ఉద్యోగ సంఘం నాయకురాలు కాంతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో ఉండగా, మారి కొన్ని జిల్లాల్లో మాత్రం బీసీ వర్గంలో కొనసాగించడం తీవ్ర వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. ఒకే రాష్ట్రంలో ఒకే సామాజిక వర్గానికి రెండు రకాల న్యాయం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ అసమానతను వెంటనే తొలగించి రాయలసీమ జిల్లాల్లోని వాల్మీకి బోయలను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా కల్పించడం ద్వారా వేలాది మంది యువతకు విద్య, ఉద్యోగాలు, ఉపాధి, ఆర్థికాభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ న్యాయమైన డిమాండ్‌ను ఇకపై నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని వాల్మీకి,బోయ సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఉద్యమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తరింపజేస్తామని తెలిపారు. 2029 ఎన్నికల నాటికి ఎస్టీ



హోదా సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా ప్రతి వాల్మీకి బోయ కుటుంబం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌ను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, సిద్ధయ్య, ఈరన్న, అరికెర మాజీ సర్పంచ్ కుప్పగంటి నాగరాజు, సురేష్, మహేంద్ర నాయుడు, రంగన్న, మధు, మహేశ్వరి, తిక్కస్వామి, ఎల్లార్తి అర్జున్ పాటు వాల్మీకి బోయ సమితి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# తప్పిపోయిన బాలురులను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు




**నంద్యాల క్రైం, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఏర్పాటు చేసిన ఆర్ టి జి ఎస్ ఏ ఐ 360 కెమెరాల సాంకేతిక పరిజ్ఞానంతో తప్పిపోయిన ఇద్దరు బాలురును గుర్తించి వారి తల్లిదండ్రులకు మహానంది పోలీసులు అప్పగించారు. మహానంది పోలీసు వారి బృందాన్ని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ అభినందించారు. 112 కు 7799806412 అను ఫోన్ నంబరు నుంచి ఫోన్ చేసి, అబ్బిపురం గ్రామానికి చెందిన గోగుల జగదీష్, వయస్సు 12, పల్లపు సుధీర్, వయస్సు 10 సం అను వాళ్ళు సాయంత్రం 06:00 గంటల నుంచి కనపడటం లేదని, ఎక్కడికి వెళ్ళినారో తెలియడం లేదని చెప్పారు. వెంటనే నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఆదేశాల మేరకు, నంద్యాల సబ్-డివిజన్ ఏఎస్పీ సుస్మిత స్వీయ పర్యవేక్షణలో నంద్యాల రూరల్ సర్కిల్ సిఐ శ్రీనివాసుల రెడ్డి, ఎస్ఐలు మహానంది, బండి ఆత్మకూరు, గోస్పాడు, వారి సిబ్బంది తో నాలుగు బృందాలుగా విడిపోయి, మహానంది మండలం, నంద్యాల లోని శ్రీనివాస సెంటర్, ఏపీఎస్ఆర్టీ బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ లలో తప్పిపోయిన పిల్లలకోసం వెతకటం ప్రారంభించాము. అదే సమయంలో తప్పిపోయిన పిల్లల ఇద్దరి ఫోటోలను సీసీటీవీ 360 యాప్ నందు అప్లోడు చేసి పరిశీలించగా నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ నందు ఉన్న సీసీటీవీ కెమెరా లో రాత్రి 07:39 గంటలకు తప్పిపోయిన ఒక బాలుడు అయిన గోగుల జగదీష్ యొక్క ఫేస్ మ్యాచింగ్ అయ్యినది. వెంటనే పోలీస్ సిబ్బంది నంద్యాల బస్టాండ్ దగ్గరకు వెళ్ళి అక్కడ ఉన్న ఆటో డ్రైవరు లకు, ప్రయాణికులకు సదరు ఇద్దరు పిల్లల ఫోటో లు చూపించి ఆచూకీ గురించి విచారించుచుండగా రాత్రి 11:30 గంటల సమయంలో ఒక ఆటో డ్రైవరు, మేము వెతుకుతన్న పిల్లలిద్దరిని దగ్గరలో రోడ్డు పై చూసినాను అని చెప్పగా, సదరు ప్రదేశం దగ్గరకు వెళ్ళు సరికి తప్పిపోయిన ఇద్దరు పిల్లలు అక్కడే ఉండినారు. వారిని పట్టుకొని, విచారించగా ఇద్దరు పిల్లలు అబ్బిపురం గ్రామంలో ఉన్న జెడ్పిహెచ్ పాఠశాల నందు చదువుతున్నాము అని, స్కూల్ లో చిన్న తప్పు పని చెయ్యడం వలన మేడమ్ మందలించి, వారి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేస్తాము అని చెప్పగా, ఇద్దరు పిల్లలు బయపడి ఇంటికి వచ్చి, స్కూల్ బుక్స్ ఇంట్లో పెట్టి, ఇంట్లో ఉన్న బట్టలు తీసుకొని ఎక్కడికైనా వెళ్ళి హాస్టల్ లో ఉందాము అని అనుకోని, ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వచ్చినాము అని చెప్పినారు. తరువాత పోలీస్ వారు సదరు ఇద్దరు పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిల్లింగ్ చేసి, తప్పిపోయిన ఇద్దరు పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడమైనది. దర్యాప్తులో భాగంగా ఆర్టిజిఎస్ సీసీటీవీ 360 అనేది ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అభివృద్ధి చేసిన సమగ్ర సీసీటీవీ పర్యవేక్షణ, నిర్వహణ వ్యవస్థ మరియు ఇతర సాంకేతిక ఆధారాలను వినియోగించి తప్పిపోయిన ఇద్దరు బాలురు ఆచూకీని గుర్తించారు. ఫిర్యాదు అందిన గంటన్నర లోపే తప్పిపోయిన ఇద్దరు పిల్లలను వెతికి వారి తల్లిదండ్రులకు అప్పగించిన నంద్యాల రూరల్ సర్కిల్ సీఐ, మహానంది, బండి ఆత్మకూరు, గోస్పాడు, ఎస్సైల వారి సిబ్బందిని, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, నంద్యాల సబ్-డివిజన్ ఏఎస్పి సుస్మిత ప్రత్యేకంగా అభినందించారు.

# గడపగడపకు తెలుగుదేశం అందరికీ సంక్షేమం.

## గడ్డం చంగల్ రాజు.

**రైల్వే కోడూరు ఆగస్టు 5 రిపబ్లిక్ న్యూస్.**
రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమం వెల్లువలా బుధవారం బొమ్మవరం గ్రామంలో సాగింది, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం చెంగళరాజు ఆధ్వర్యంలో ఓబులవారిపల్లి మండలం బొమ్మరం గ్రామంలో కూడా చైర్మన్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమం బొమ్మవరం గ్రామంలో ప్రతి ఇంటింటికి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కార్యక్రమాలను చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ మైనారిటీ దళిత పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేసినటువంటి అభివృద్ధి ఫలాలను కరపత్రాల రూపంలో ప్రజలకు తెలియజేస్తూ గడపగడపకు కార్యక్రమాన్ని విజయవంతంగా సాగించారు రూపానంద రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను పథకాలను అందరికీ తెలియజేస్తూ వీధివీధిన గడపగడపకు తెలియజేస్తూ గ్రామంలో క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురండి ఆ సమస్యలను అధికారులకు తెలియజేసి సత్వరమే పరిష్కారం చేస్తామన్నారు రోడ్లు గాని వీధి దీపాలు త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు ఏ గ్రామంలోనైన సమస్య ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు, సీనియర్ టిడిపి నాయకుడు గడ్డం చెంగల్ రాజు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం



మనది మన అందరిదీ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు సాగాలని అందుకు ప్రతి ఒక్కరం తెలుగుదేశాన్ని ముందుండి నడిపించాలని ఆయన గడపగడపకు కార్యక్రమంలో ప్రతి గడపను కోరారు, తెలుగుదేశం అంటే అభివృద్ధి సంక్షేమం అందుకే మనందరం తెలుగుదేశాన్ని నిర్మిద్దాం అభివృద్ధి వైపు పైనేద్దాం అన్నారు,ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర రాజు, జల సంఘం అధ్యక్షుడుసి. వెంకటసుబ్బరాజు,విద్యాకమిటి చైర్మన్ చక్రవర్తుల సుబ్రమణ్యం రాజు, సమతా సైనిక్ దళ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చౌడవరం సుబ్బనర్సయ్య, ఓబులవారిపల్లి మాజీ సర్పంచ్ ఓబిలి శ్రీధర్ రెడ్డి, యువ నాయకుడు నూక పాపు గారి బాబుల్ రెడ్డి, శివయ్య నాయుడు, మైనార్టీ నాయకులు షేక్ వల్లి షాబ్, అక్బర్ బాషా పాల్గొన్నారు, అంతకుముందు ఉదయం మంగంపేట పంచాయతీ ఆర్ఆర్ ఫోర్ లో సీనియర్ నాయకుడు ఏ చంద్రమోహన్ ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం జరిగింది కోడూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి ముఖ్య అతిధులుగా ఈ కార్యక్రమంలో





పాల్గొని గడపగడపకు కార్యక్రమంలో ప్రతి గడపలోనూ కార్యకర్తలను ప్రజలను కలుసుకొని ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు వారికి వివరిస్తూ క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏ చంద్రమోహన్, గునిపాటి రాయుడు, గునుపాటి కిరణ్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన రాజుకు సన్మానం

**పత్రికలు ప్రజా వారధిగా పనిచేయాలి -మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్**





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
టీ డబ్ల జె యు ఐ జె యు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీగా ఎన్నికైన జోగిపేట పట్టణానికి చెందిన ఉలువల రాజుకు ఈశుభ సందర్భంగా ఆయన చిన్ననాటి మిత్రులు ఈ రోజు వారి నివాసంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.విద్యార్థి దశలోనే క్లాస్ మానిటర్గాచురుకైన పాత్రను పోషిస్తూ అంచనాంచలుగా జోగిపేట నెహ్రూ మెమోరియల్ కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్ గా అలాగే జర్నలిజం లో అడుగుపెట్టిన అతి చిన్న వయసులోనే సంగారెడ్డిజిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీగా నియమితులైన శుభ సందర్భంగా వారికి ఈరోజు ఘనంగా పూలమాలలు శాలువలతో సత్కరించడం జరిగింది.మా మిత్రుడు అంచనాంచలుగా జిల్లా స్థాయి లెవెల్లో ఎదగడం అనేది సామాన్యమైన విషయం కాదు ఇంకా పత్రికా రంగంలోజిల్లా స్థాయిలో మంచి పేరును సంపాదించుకోవాలని అంచలంచెలుగా జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు చేరాలని వారి సేవలు ప్రజాసేవస్యకై ప్రతినిత్యం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పత్రిక ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను ప్రభుత్వం చేస్తున్నటువంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంచి చెడులను ప్రజలకు వారి పత్రికా ద్వారా నిజా నిజాలను రాయాలని ఆకాంక్షిస్తూ వారి పాత్ర విలువైనదని ఈ సందర్భంగా వారి చిన్ననాటి స్నేహితులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో:- మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్, రెడ్డిపల్లి శ్రీనివాస్, కొత్త శ్రీశైలం,శ్రీనివాస్ రెడ్డి,ఆకుల నందు తదితరులు పాల్గొన్నారు.

# బళ్ళారి చౌరస్తా ట్రాఫిక్‌కు చెక్..

## రూ.1.55 కోట్లతో బైపాస్ రహదారి ప్రారంభం

**రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్ చేతుల మీదుగా ప్రారంభం ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా కానున్నదని వెల్లడి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 5)**
నగరంలోని బళ్ళారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనదారులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేందుకు రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన బైపాస్ రహదారిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీ.జీ. భరత్ ప్రారంభించారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్, ఐపీఎస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ నగర ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి దశలవారీగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే బుధవారపేట మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణ పనులు పూర్తయ్యాయని, త్వరలో కిడ్స్ వరల్డ్ నుంచి కల్లూరు



దర్వాజా వరకు రహదారి విస్తరణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.హైదరాబాద్ వైపు నుంచి బస్టాండ్‌కు వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గంగా ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ఈ బైపాస్ రహదారిని నిర్మించినట్లు మంత్రి తెలిపారు. ఏపీఎస్పీ 2వ బెటాలియన్, పోలీసు శాఖ సహకారంతో అవసరమైన అనుమతులు వేగంగా లభించాయని, నగరపాలక సంస్థ నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేసిందన్నారు.
నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో ఇది కీలకమైన అడుగు అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రెండు దుకాణాలను తొలగించి మరోచోట పునర్నిర్మించామని, గోశాల, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.69.50 లక్షలు, రహదారి మరియు డ్రైనేజీ నిర్మాణానికి రూ.85 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు.
ఈ బైపాస్ అందుబాటులోకి రావడంతో బళ్ళారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజల ప్రయాణ సమయం కూడా ఆదా కానుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీఎస్పీ చీఫ్ సెక్టార్ కోఆర్డినేటర్లకు రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్, పార్టీ నేతలు ఘన స్వాగతం



**హైదరాబాద్ ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్):** బీఎస్పీ చీఫ్ సెక్టార్ కోఆర్డినేటర్లు, తెలంగాణ, ఆంధ్రపదేశ్ ఇంచార్జీలు అథర్ సింగ్ రావు గారు, సురేష్ ఆర్య గార్లకి పార్టీ తెలంగాణ అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ గారు, ఇతర నేతలు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లో ఘన స్వాగతం పలికారు.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఇంచార్జీలుగా ఉన్న వీరు తాజాగా కర్నాటక రాష్ట్రానికి ఇంచార్జ్ లుగా అదనంగా నియామకమైన సందర్భంగా తొలిసారిగా హైదరాబాద్ విచ్చేశారు.ఈ సందర్భంగా నేతలు వారికే? శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్ కృష్ణ గారు, ప్రధాన కార్యదర్శి ,చీఫ్ జోన్ ఇంచార్జ్ బోడపట్ల ఈశ్వర్ గారు, చీఫ్ జోన్ ఇంచార్జ్ లు దాగిల్ల దయానంద రావు గారు, అదిలాబాద్ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిశాని రామచంద్రం గారు,కోశాధికారి నాయిని ప్రణయ్,రాష్ట్ర ఈసీ మెంబర్ మాతంగి అశోక్ గారు, జోన్ 1 ఇంచార్జీలు కళ్లేపల్లి రాజేందర్ గారు, దొడ్డే సమ్మయ్య గారు, పార్లమెంట్ ఇంచార్జ్ సొంటే శ్రీనివాస్ గారు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## విదేశాలకు వెళ్లండి, కానీ తిరిగి రండి

**: విద్యార్థులకు వెంకయ్యనాయుడు దిశానిర్దేశం**

విద్య, వైద్యం, రాజకీయం వంటి రంగాలను ఒక పవిత్రమైన యజ్ఞంలా (మిషన్) భావించాలని, వాటి ద్వారా లబ్ధి పొందేందుకు (కమిషన్) ప్రయత్నించరాదని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు యువతకు పిలుపునిచ్చారు. అమరావతిలోని అమృత విశ్వ విద్యాపీఠం స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రసంగం తనను ఎంతగానో ఆకట్టుకుందని, అందుకే తాను సిద్ధం చేసుకున్న ప్రసంగ పత్రాన్ని పక్కనపెట్టి మనసులోని మాటలను పంచుకుంటున్నానని తెలిపారు. దేశం పట్ల అభిరుచి పెంచుకుని, అంకితభావంతో పనిచేయాలని ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

# వర్షపు నీరు ఒడిసిపడదాం -భూగర్భ జలాలను పునరుద్ధరించుకుందాం

**సీసీ రోడ్ల విస్తరణతో భూమిలోకి ఇంకని వర్షపు నీరు**

**కాగితాలకే పరిమితమైన ఇంకుడు గుంతలు..**

**పెరుగుతున్న భూగర్భ జలాల సంక్షోభం**

**మేలుకోకపోతే రేపటి తరానికి దొరకని చుక్క నీరు**

**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 05, (రిపబ్లిక్ న్యూస్):**
వర్షం కురిస్తే రైతు ముఖంలో ఆనందం, చెరువుల్లో కళకళ, బావుల్లో నీరు, భూగర్భ జలాలకు జీవం లాంటి పరిస్థితి ఒకప్పుడు కనిపించేది. కానీ నేడు అభివృద్ధి పేరుతో పట్టణాలు, గ్రామాలు పూర్తిగా కాంక్రీట్ తో పూర్తిగా అడవులను తలపిస్తూ .. ఉండడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం రోజురోజుకూ తగ్గిపోతోంది. సీసీ రోడ్లు, ఇంటి ప్రాంగణాల్లో పూర్తిస్థాయి సిమెంట్ ఫ్లోరింగ్, ఖాళీ స్థలాలు లేకపోవడం వంటి కారణాలతో వర్షపు నీరు నేరుగా డ్రెయిన్లలోకి చేరి చివరకు వాగులు, నదుల్లో కలిసిపోతోంది. దీంతో భూగర్భ జలాలు పునరుద్ధరించబడకుండా ప్రతి వేసవిలో నీటి ఎద్దడి మరింత తీవ్రమవుతోంది.

**కృషి చేయకపోతే .. తీవ్రమైన నీటి కొరత :**
జిల్లాలో గత కొన్నేళ్లుగా వర్షపాతం సాధారణ స్థాయిలో నమోదవుతున్న సందర్భాలు ఉన్నప్పటికీ, భూగర్భ జలమట్టంలో ఆశించిన పెరుగుదల కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం వర్షపు నీటిని భూమిలోకి పంపే సహజ మార్గాలు మూసుకుపోవడమేనని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికైనా వర్షపు నీటి సంరక్షణకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజలు



సమిష్టిగా కృషి చేయకపోతే భవిష్యత్ తరాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**అభివృద్ధి సహజమే... కానీ ప్రకృతికి బారీ నష్టం :**
గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు అభివృద్ధి పనుల పేరుతో విస్తృతంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. వర్షాకాలంలో బురద సమస్య తగ్గడం, రవాణా సౌకర్యం మెరుగుపడటం వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వాటి వల్ల వర్షపు నీరు నేలలోకి ఇంకే అవకాశం దాదాపు లేకుండా పోయింది. రోడ్లతో పాటు ఇంటి ఆవరణలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు కూడా పూర్తిగా సిమెంట్‌తో నిర్మించడం వల్ల భూమి సహజంగా నీటిని గ్రహించే సామర్థ్యాన్ని కోల్పోతోంది.

**డ్రెయిన్లలోకి వర్షపు నీరు .. అవి అడుగంటితే కన్నీరు :**
కురిసే భారీ వర్షానికి నీరు పట్టణాల డ్రెయిన్ల ద్వారా బయటకు వెళ్లిపోతోంది. ఈ నీటిలో కొంత భాగమైనా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షపు నీటిని నిల్వ చేయడం లేదా ఇంకించడం కంటే, ఎంత త్వరగా బయటకు పంపాలనే దిశగా మాత్రమే మౌలిక వసతులు అభివృద్ధి చేయబడుతున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు.

**కాగితాలకే పరిమితమైన ఇంకుడు గుంతలు :**
ప్రభుత్వాలు భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సమయంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిబంధనలు రూపొందించినప్పటికీ, వాటి అమలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. భవన ప్లాన్లలో ఇంకుడు గుంతలు చూపించి అనుమతులు పొందుతున్నా, నిర్మాణం పూర్తయ్యాక చాలా చోట్ల వాటిని ఏర్పాటు చేయడం లేదు. సంబంధిత అధికారులు కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంతో నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**500 అడుగులలో కూడా నీరు అందని పరిస్థితులు :**
వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలతో పట్టణ ప్రాంతాల్లో ప్రతి అవసరానికీ బోర్లపై ఆధారపడుతున్న పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు తిరిగి నింపబడకపోవడంతో ప్రతి సంవత్సరం కొత్త బోర్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో 100 నుంచి 150 అడుగుల లోతులో లభించిన నీరు, ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో 500 నుంచి 800 అడుగుల లోతులో కూడా అందని పరిస్థితులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**వర్షాకాలంలోనే నీటి సంరక్షణపై దృష్టి అవసరం :**
వేసవి వచ్చిన తర్వాత ట్యాంకర్ల కోసం ఎదురు చూడటం, తాగునీటి కోసం ఇబ్బందులు పడటం కంటే వర్షాకాలంలోనే నీటి సంరక్షణపై దృష్టి పెట్టడం అత్యవసరం. ప్రతి ఇంటి వద్ద, అపార్ట్‌మెంట్‌లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, పరిశ్రమల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. సీసీ రోడ్ల నిర్మాణంలో కూడా వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా రీచార్జ్ పిట్లు, రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి :**
ఇంకుడు గుంతలు లేకుండా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే నిర్మించిన భవనాల్లో కూడా రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను తప్పనిసరి చేయాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. స్థానిక సంస్థలు ప్రతి వర్షాకాలానికి ముందు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు అమలు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా నీటి సంరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

**ప్రతి నీటి బొట్టూ .. భవిష్యత్తుకు ఒడిసిపట్టు :**
భూమిలోకి ఇంకిన ప్రతి వర్షపు బొట్టు రేపటి తాగునీటికి పెట్టుబడి. వృథాగా పారుతున్న ప్రతి బొట్టు భవిష్యత్తు నీటి కొరతకు సంకేతం. నీటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మార్చినప్పుడే భూగర్భ జలాలను కాపాడుకోవడం సాధ్యమవుతుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టితేనే రాబోయే తరాలకు నీటి భద్రతను అందించగలమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# తల్లిపాల వారోత్సవాలు



**మల్లాపూర్ ఆగస్టు 5 (రిపబ్లిక్ న్యూస్)**
వేంపల్లి గ్రామంలో అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాల కార్యక్రమం గ్రామపంచాయతీలో కార్యలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లికి వచ్చే ముర్రిపాలను తప్పకుండా పాటించాలని అన్నారు. తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. అనంతరం అక్షర బ్యాసం, ఐసిడియస్ ద్వారా వచ్చిన బాలమృతం, పప్పుసరుకులను గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రోడ్డ హారిక, వార్డు సభ్యులు మిట్టపల్లి జలపతిరెడ్డి, ఎశ్రీష్రజూ శైలజ, ఏఎన్ఎం కోమల, అంగన్వాడి కార్యకర్త అచ్చ నర్మదా, ఆశ కార్యకర్తలు వసంత, బాలింతలు, గర్భిణీలు స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## సానుభూతి తెలిపిన సర్పంచ్ ఎంపీటీసీ



**రామకుప్పం 5 ఆగస్టు రిపబ్లిక్ న్యూస్**
రామకుప్ప మండలం కంచనవల పంచాయితీ చెందిన వీజీ నారాయణప్ప ఈరోజు అక్షమాత్రగా మరణించడం జరిగింది
కావున వైఎస్ఆర్సిపి లీడర్లు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా అంత్యక్రియలు చేయడం జరిగింది
కించన వల్ల మాజీ సర్పంచ్ కె సుబ్రమణ్యం ప్రచారమాపణ పెళ్లి చలపతి ఎంపీటీసీ కో ఆప్షన్ మండల్ కన్వీనర్ బర్కతుల్లా దామోదర్ ఆర్ కె వెంకటా చలపతి కోట శీను మంజునాథరెడ్డి కుమారు కార్తీక్ సోము వైఎస్ఆర్సిపి కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు

### రాయికల్ పట్టణములో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వాసం ప్రసాద్ ఆధ్వర్యంలో

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన.. పండ్లు, బ్రెడ్ పంపిణీ





**రాయికల్ మండలం ఆగస్టు,05( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణములో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయికల్ ఆధ్వర్యంలో బుధవారం రాయికల్ పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం ( ఎం ఆర్ సి ) కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్వైజర్ పద్మావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యం, పోషణ, రోగనిరోధక శక్తిపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

### రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో రాయికల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఉచిత కంటి ఆపరేషన్లు ఈనెల 7న శుక్రవారం

**రాయికల్ మండలం ఆగస్టు,05( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యం లో రేకుర్థి కంటి హాస్పిటల్ కరీంనగర్ గారిచె ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం ఈనెల 7న శుక్రవారం రాయికల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశామని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వాసం ప్రసాద్ తెలిపారు ఈ శిబిరంలో కంటిచూపు లోపాలు ఉన్నవారిని డాక్టర్లచే పరీక్షలు చేయించి వారిలో మోతె బిందువు కంటిలో శుక్లాలు ఉన్న వారిని గుర్తించి ఆపరేషన్ అవసరం ఉన్నచో వెంటనే రేకుర్తికి ఉచిత బస్సు సౌకర్యంతో తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించగలరు ఇట్టి అవకాశాన్ని రాయికల్ మరియు పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోగలరు దీనికి తెల్ల రేషన్ కార్డు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకుని రాగలరని రాయికల్ మండలం లో నుండి ఏ గ్రామంలో నుండి వచ్చిన వారికి ఉచితంగానే కంటి ఆపరేషన్లు చేయబడును అని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వాసశీ ప్రసాద్ తెలిపారు ఈ కార్యక్రమాన్ని లైన్స్ క్లబ్ సభ్యులు దగ్గరుండి విజయవంత చేయాలని ఆయన కోరారు




# బోనమెత్తిన 08వ వార్డ్ మాజీ కౌన్సిలర్ రాచకొండ భవాని నాగరత్నం గౌడ్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఉన్న ఆందోల్ గ్రామంలో మంగళవారం ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భముగా కౌన్సిలర్ రాచకొండ నాగరత్నం గౌడ్ ఆధ్వర్యములో బోనాల ఉత్సవాలు నిర్వహించారు.వార్డులో పెద్దఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య పోచమ్మ దేవాలయం చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించుకుని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.
ఈ సందర్భముగా కౌన్సిలర్ రాచకొండ నాగరత్నం గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఆషాఢ మాసం బోనాల పండుగ పురస్కరించుకొని వార్డులో మహిళలు యువకులు భక్తి పారవశ్యంతో బోనాల పండగ జరుపుకోవడం ఆనందం ఉన్నది కౌన్సిలర్ నాగరత్నం గౌడ్ అన్నారు.ఈ బోనాల ఉత్సవాల్లో గల్లి పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీలో అంగరంగ వైభవంగా చీల మల్లన్న ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల ఊరేగింపు



**సదాశివపేట ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
దుర్గమ్మ జాతర ఎడ్లబండ్ల ఊరేగింపు కాపు చీల మల్లన్న పరంపర అనాదికాలం నుండి వస్తున్న చీల వారి బండి దుర్గమ్మ జాతరలో కొనసాగుతుంది. ఇట్టి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు యువ నాయకులు పాల్గొన్న వారు చీల విశ్వేశ్వర్, చీల వీరన్న ,చీల శివ చంద్ర చీల వేషాల బోడగ్గమా సంగఅన్న బోడగ్గమా వీరన్న బ్రహ్మ మ్మ స్వామి చందు స్వామి ఎంఆర్ఎఫ్ ఎంప్లాయ్ అయినటువంటి ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు

# భూపతిపూర్ లో ధర్మ రక్షణ, ధర్మపాలకుల పరిరక్షణార్థం లోకకళ్యాణం, వర్షాలు కురవడానికై ““శ్రీరామ హృదయ కలశం““

### -చిన్న జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా ఘనంగా శ్రీరామ హృదయ కలశ యాత్ర...

**రాయికల్ మండలం ఆగస్టు,05( రిపబ్లిక్ న్యూస్)**
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా, లోకకళ్యాణం, సనాతన ధర్మ పరిరక్షణ, ధర్మ సంస్థాపన లక్ష్యాలతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “శ్రీరామ హృదయ కలశ యాత్ర శ్రీరామ పాదయాత్ర“ జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మినారసింహ స్వామివవారి ఆలయంలో జరిగింది. గ్రామ సర్పంచ్ గుర్రం భావనమహేందర్ గౌడ్ కు, ఆలయ చైర్మన్ జక్కుల చంద్రశేఖర్ కు వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, కలశాన్ని, జీయర్ స్వామి వారి చిత్రపటాన్ని అందజేసారు. ఈ కలశాన్ని సర్పంచ్, ఆలయ చైర్మన్, ఉపసర్పంచ్ మూగల సంజీవచారీ, ఆలయ కమిటి బాధ్యులు బొల్లె భూమనర్సుచిన్నయ్య, నలువాల రాము, కొమ్ము దిలీప్, పీలి నర్సారెడ్డి, రొండ్ల రాజేశం, నెల్లూరి శ్రీనివాస్, జక్కుల విద్యాసాగర్, సంకోజి మహేష్, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు ఘన స్వాగతం పలికి “జై శ్రీరామ్“, “శ్రీరామ జయరామ్ జయ జయ రామ్“ నామస్మరణలతో కలశాన్ని శ్రీ లక్ష్మినారసింహ దేవాలయానికి తీసుకెళ్లారు. ఆలయ అర్చకులు కాకుస్తం వెంకట రమణమాచార్యులు, వెంకట కృష్ణమాచార్యులు, శ్రీపెరంబుదూరి ప్రదీపాచార్యులు శ్రీరామ అష్టోత్తర శతనామావళితో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ప్రజాప్రతినిధులు, భక్తులు



“శ్రీరామ“ నామస్మరణ చేస్తూ అక్షింతలను గింజలను కలశంలో సమర్పించి శ్రీరాముని అనుగ్రహం కోరుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి బాధ్యులు వెంకటకృష్ణమాచార్యులు మాట్లాడుతూ శ్రీమన్నారాయణ సేవా పరంపరలో భాగంగా జీయర్ స్వామివారి దివ్య ఆశీస్సులతో దేశవ్యాప్తంగా 70వ తిరునక్షత్ర ప్రయుక్త శ్రీరామ హృదయ కలశ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 29 నుండి అక్టోబర్ 26, 2026 వరకు 90 రోజుల పాటు ప్రతి గ్రామంలో “శ్రీరామ పాదయాత్ర ఇంటింటి సత్సంగం“ నిర్వహిస్తూ, ప్రతి రోజు ఉదయం 6 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీరామ నామసంకీర్తనం, భజనలు, సత్సంగాలు నిర్వహించడం ద్వారా ప్రతి ఇంటిలో ఆధ్యాత్మిక చైతన్యం, శ్రీరామ భక్తి పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, భారతదేశం విశ్వగురువుగా ఎదగాలని, దేశద్రోహుల, శత్రుదేశాల కుతంత్రాలు పటాపంచలై ధర్మస్థాపన జరగాలని, ధర్మపాలకులకు రక్షణ కలగాలనె సంకల్పాలతో ఈ యాత్ర కొనసాగుతోందన్నారు. రాయికల్ మండలంలోని ప్రతి గ్రామ దేవాలయంలో రోజుకో గ్రామంలో శ్రీరామ హృదయ కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్ని కలశాలను హైదరాబాద్ ఆశ్రమానికి తీసుకెళ్లి, జీయర్ స్వామివారి సప్తతి (70వ) తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా దివ్యసాకేతంలో సాకేత శ్రీరాముడికి 1008 శ్రీరామ హృదయ కలశాలతో మహాభిషేకం నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమం లో మారంపెల్లి గంగాజల, కట్ట స్వప్న, గుండోజి రాజమణి, అమరగొండ మాధురి, వాసాల లావణ్య, బండి సునీత, అమరగొండ మాధవి, గుండోజి రాజమణి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి చేతుల మీదుగా టీపీఎస్ఎంఏ అకాడమిక్ క్యాలెండర్ విడుదల

**సంగారెడ్డి నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
సంగారెడ్డి: తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (టీ ర్ ఎస్ ఎం ఏ ) ఆధ్వర్యంలో రూపొందించిన 202627 విద్యా సంవత్సర అకాడమిక్ క్యాలెండర్ను సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారిణి శ్రీమతి రోహిణి విడుదల చేశారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రైవేట్ పాఠశాలల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎంఈఓ విద్యాసాగర్, జిల్లా సైన్స్ సెంటర్ ఇన్‌చార్జ్ సిద్ధారెడ్డి, టీపీఎస్ఎంఏ రాష్ట్ర సలహాదారు పూసల లింగా గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఆంథోనీ రెడ్డి, రాష్ట్ర సభ్యులు పి. నాగిరెడ్డి, కిషన్, సతీష్, శేఖర్, రామకృష్ణ, వాసుతో పాటు సదాశివపేట, పటాన్‌చెరు, జోగిపేట, రామచంద్రపురం ప్రాంతాల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు15 నుండి కొత్త పింఛన్లు

## కాంగ్రెస్ జగిత్యాల జిల్లా యువత అధ్యక్షుడు బిరం రాజేష్

-------తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత ముందుండాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి.....

......... రాయికల్ పట్టణ కేంద్రం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్





**రాయికల్ మండలం ఆగస్టు,05( రిపబ్లిక్ న్యూస్)**
15 ఆగస్టు నుండి కొత్త పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా మన కాంగ్రెస్ యూత్ కార్యకర్తలు తప్పనిసరి ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ పై కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని తెలుపాలని రాయికల్ పట్టణ శీ యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిరమ్ రాజేష్ అన్నారు
కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్ అన్నారు.మంగళవారం రాయికల్ పట్టణంలో పట్టణ,మండల యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ యువతకి అవకాశాలు కల్పిస్తుందని కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులైన వారికి చేరేలా అవగాహన కల్పించాలని అన్నారు.రాజకీయాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలని ప్రతి యువకుడు ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి రావాలని సూచించారు.యువత తమ ప్రతిభ,సేవా దృక్పథం,నిబద్ధతతో ప్రజలకు చేరువై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావడంతో పాటు సామాజిక సేవలో ముందుండాలని కోరారు.దేశాభివృద్ధి,రాష్ట్ర ప్రగతిలో యువశక్తి కీలకమని పార్టీ బలోపేతానికి యువత ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు.గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ యువతకు సముచిత ప్రాధాన్యతతో పాటు నాయకత్వ అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. రానున్న ఎంపీటీసీ,జడ్పిటిసి ఎన్నికల్లో యువత చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ బలుస సాయి,అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ కర్నె భూమా రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొద్దుల శివ,రాయికల్ పట్టణ యూత్ నాయకులు పడిగెల నరసింహ, అల్లె పురుషోత్తం,అనుమల్ల చింటూ,కాశిరెడ్డి సంజీవ్,మోర చైతన్య,గుండేటి రూపేష్,నరంశెట్టి మనోజ్,గట్టు బంటు,సింగని వరుణ్,శ్రీరాముల సాయి,కొత్తపెల్లి అరవింద్, శివ,శ్రీకాంత్, సాయి,హరీష్,జలపతి,మధు,యూత్ నాయకులు పాల్గొన్నారని రాయికల్ మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిపోజి మహేందర్ బాబు తెలిపారు

# రామచంద్రాపురంలో,బిర్యానీ పాయింట్ ప్రారంభించిన ఎమ్మెల్సీ అంజి రెడ్డి

**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు రామచంద్రపురం లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి చేతుల మీదగా బిరియాని పాయింట్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పి పి యు ఎస్ మండల ప్రెసిడెంట్ అబూ అలీ సురేషి.రామచంద్రపురం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద శ్రీ కేతకి సంగమేశ్వర మినీ బిర్యాని పాయింట్ మరియు టిఫిన్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి బిఆర్ఎస్ టి పి యూ ఎస్ మండల ప్రెసిడెంట్ అబూ అలీ ఖురేషి.



# నేరడిగుంట-మక్తగూడెం ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 5 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈరోజు అనారోగ్యంతో మృతి చెందిన శ్రీ వడ్డె నర్సింలు గారి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ గారు పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో మృతి చెందిన వారి కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని సర్పంచ్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీ ఈశ్వర్ గారు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొని వడ్డె నర్సింలు గారికి ఘనంగా నివాళులర్పించారు.



## మహిళల భద్రత, సైబర్ నేరాలు, శక్తి యాప్, మాదకద్రవ్యాల నివారణ,

# ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన.

**అత్యవసర పరిస్థితుల్లో డయల్-112, శక్తి యాప్ వినియోగంపై సూచనలు**






**నంద్యాల క్రైం, ఆగస్టు 5, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, శక్తి టీం పోలీస్ అధికారులు మహిళల భద్రత, విద్యార్థుల రక్షణ, సైబర్ నేరాల నివారణ, సామాజిక చైతన్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు నంద్యాల పట్టణ కేంద్రంలో గల గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ టేక్కే, ఆర్టీసీ బస్టాండ్, ముఖ్యమైన కూడళ్ళ, షాపింగ్ మాల్స్, కొత్తపల్లి కేజీబీవీ స్కూల్, జిల్లాలోని స్కూల్ మొదలగు ప్రాంతాలలో మహిళలు /చిన్నపిల్లల భద్రత కోసం శక్తి టీం బృందం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక గస్తీని నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, లోన్ యాప్ మోసాలు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, సైబర్ నేరాలు, మోసపూరిత ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన చట్టపరమైన పరిణామాలు, అపరిచిత లింకులు, వీడియో కాల్స్ ప్రమాదాలు, సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై సమగ్రంగా వివరించారు. అలాగే బాల్య వివాహాల దుష్పరిణామాలు, మహిళల అక్రమ రవాణా (విమెన్ ట్రాఫికింగ్), మహిళలపై నేరాల నివారణ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. మంచి వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, మంచి స్నేహాలు, సత్ప్రవర్తన, మంచి అలవాట్లు అలవరచుకోవాలని సూచిస్తూ, సమాజంలో మహిళలు మరియు చిన్నారులపై ఇటీవల జరుగుతున్న ఘటనలను ఉదాహరణలుగా వివరించి విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్‌లను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద సంఘటనలు, మహిళలపై వేధింపులు, సైబర్ మోసాలు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, అలాగే శక్తి యాప్ ద్వారా పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు , శక్తి టీం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేద కుటుంబాలకు పక్కా ఇళ్ళు నిర్మాణాలు పూర్తి చేసి త్వరగా అందించాలి

**పెండింగ్ లో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలిలి**

**గృహ నిర్మాణ పథకాల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియాలి**




**నంద్యాల బ్యూరో, ఆగస్టు05 (రిపబ్లిక్ న్యూస్):**
అర్హులైన లబ్ధిదారులకు జిల్లాలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి గృహ నిర్మాణాల పురోగతి పై హౌసింగ్ పి డి శ్రీహరి గోపాల్, ఎంపిడిఓ లు, మున్సిపల్ కమీనర్లు, ఈ ఈ, ఎ ఈలతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0, గ్రామీణ పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణ పథకాల అమలును వేగవంతం చేయాలని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన గృహ నిర్మాణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణతో వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 7363 లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించడం జరిగింది. అందులో ఇప్పటివరకు 271 ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. వీటితోపాటు మరుగుదొడ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, మంజూరైన గృహాలను పూర్తి చేసి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

## విద్యాశాఖ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లలో పనితీరు మెరుగుపర్చాలి

**లీప్ యాప్‌లో సకాలంలో వివరాలు నమోదు చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
విద్యాశాఖ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐలు)లో జిల్లా పనితీరును మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కేపీఐల అమలు, లీప్ యాప్‌లో డేటా నమోదు, పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు కేటాయించిన 38 కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ లోపు కేపీఐల నమోదును పూర్తి చేయాలని సూచించారు. వీటిలో డైలీ, వీక్లీ, మంత్లీ, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, యాన్యువల్ విభాగాలకు సంబంధించిన సూచీలను నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. వారపు సూచీలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు 95 శాతానికి పైగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులందరూ లీప్ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం వినియోగం, పేరెంట్ ఫీడ్‌బ్యాక్, పబ్లిక్ పర్సెప్షన్ మెరుగుపడేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల నమోదు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల హాజరు, లీప్ యాప్ డౌన్‌లోడ్, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల తనిఖీలు, డ్రాపౌట్‌ల తగ్గింపు, అవుట్ ఆఫ్ స్కూల్ పిల్లల గుర్తింపు, ఎఫ్ఎల్ఎన్ అమలు, అపార్ ఐడీ నమోదు, విద్యార్థి కిట్ల పంపిణీ, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు కేపీఐలపై పూర్తి అవగాహనతో పనిచేస్తూ లీప్ యాప్‌లో ఖచ్చితమైన సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని, సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి జిల్లాను అన్ని సూచీల్లో మెరుగైన స్థానంలో నిలిపేందుకు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనితీరు మెరుగుపడని పక్షంలో బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఎన్‌రోల్‌మెంట్‌లో వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి పి. జనార్ధన్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం నుంచి జిల్లా వరకు సమగ్ర ఆర్థిక ప్రణాళికతో

# వేగవంతమైన అభివృద్ధి సాధ్యం

**శాస్త్రీయ మైక్రో ప్లానింగ్‌తో అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, ఆగస్టు 05 (రిపబ్లిక్ న్యూస్):**
గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు శాస్త్రీయమైన సూక్ష్మ ప్రణాళిక (మైక్రో ప్లానింగ్) ఆధారంగా సమగ్ర ఆర్థిక నివేదికలను రూపొందించి, అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేసినప్పుడే జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (హెచ్‌ఆర్‌డీ)లో జిల్లా అధికారుల కోసం నిర్వహించిన సామర్థ్య వృద్ధి (కెపాసిటీ బిల్డింగ్) శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక గణాంక శాఖ డైరెక్టర్ బి. గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సీపీఓ ప్రకాశ్, సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, శిక్షణాధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, సహజ వనరులు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సూచీలు, ఆదాయ వనరులు, అభివృద్ధి అవకాశాలు, సవాళ్లపై ప్రతి శాఖకు సమగ్ర అవగాహన ఉండాలని సూచించారు. శాస్త్రీయ ప్రణాళికతో ముందుకు సాగితే జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఫీడ్‌బ్యాక్ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితి, అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధి అవకాశాలు, సమస్యలు, సవాళ్లపై సమగ్రంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారని తెలిపారు. ఆ సూచనలను పరిగణనలోకి తీసుకొని ఈ సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. ఈ శిక్షణలో రాష్ట్ర స్థాయి నిపుణుల బృందం గ్రామ, మండల, జిల్లా స్థాయి ఆర్థిక నివేదికల రూపకల్పన, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనా విధానం, వివిధ రంగాల ఆర్థిక విశ్లేషణ, అభివృద్ధి సూచీల రూపకల్పన వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు ఎటువంటి సంకోచం లేకుండా సందేహాలను నివృత్తి చేసుకొని, తమ శాఖల ప్రణాళికలను మరింత సమర్థవంతంగా రూపొందించుకోవాలని సూచించారు. సమష్టి కృషి, శాఖల సమన్వయంతో పనిచేస్తే జిల్లా అభివృద్ధిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక గణాంక శాఖ డైరెక్టర్ బి. గోపాల్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమగ్ర ఆర్థిక ప్రణాళికలను రూపొందించి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడమే ఈ సామర్థ్య వృద్ధి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, సహజ వనరులు, ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు, ఆర్థిక సూచీలు, అభివృద్ధి సవాళ్లపై శాఖల వారీగా సమగ్ర అవగాహన పెంపొందించుకొని సూక్ష్మ స్థాయి ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విజన్ -2047 లక్ష్యాలను సాధించాలంటే ప్రతి సమస్య సుమారు పదవి శాతం వృద్ధి నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. లక్ష్యాన్నికి అనుగుణంగా సమర్థవంతమైన ప్రణాళిక, సమన్వయం క్షేత్రస్థాయి అమలతో వృద్ధి సాధించవచ్చు అన్నారు. ప్రతి అధికారి శిక్షణలో చురుకుగా పాల్గొని సందేహాలను నిర్మొహమాటంగా నివృత్తి చేసుకోవాలని, చిన్న సూచనలు సైతం అభివృద్ధి ప్రణాళికల్లో గణనీయమైన మార్పులకు దోహదపడతాయని పేర్కొన్నారు. సమష్టి కృషితో జిల్లాను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ఇటువంటి సామర్థ్య వృద్ధి కార్యక్రమాలు కీలకంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం నిపుణుల బృందం 'స్వర్ణాంధ్ర విజన్', జిల్లా అభివృద్ధి లక్ష్యాలు, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) భావన, ఆర్థికాభివృద్ధి సూచీలు, జిల్లా స్థాయిలో జీడీపీ అంచనా విధానం, రంగాల వారీ ఆర్థిక వృద్ధి విశ్లేషణ, మైక్రో ప్లానింగ్ విధానంపై అధికారులకు దశల వారీగా శిక్షణ నిచ్చారు.

## గురురాజ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

**యోగా పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన చైర్మన్ దస్తగిరి రెడ్డి , షేక్షావలి రెడ్డి**



**నంద్యాల ఆగస్టు 5( రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి యోగా హాల్ లో జిల్లాస్థాయి యోగా జట్టు ఎంపిక అసోసియేషన్ చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారన్నారు. యోగ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొనగా గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికయ్యారని గుర్తు చేశారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్', 'వైఎఫ్ఐ" ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని 'విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఆగస్టు 29 మరియు 30 తేదీలలో బాలురు, బాలికలు మరియు పురుషులు, మహిళల కోసం '51వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి యోగా క్రీడల ఛాంపియన్‌షిప్-2026' నిర్వహించే పోటీల్లో పాల్గొని విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికైన శిక్షణ ఇచ్చిన యోగా మాస్టర్ ను అభినందించారు.

# శ్రీశైలం జలాలపై రాయలసీమ హక్కు..

## పోతిరెడ్డిపాడు నుండి వెంటనే నీటిని విడుదల చేయాలి!

**విద్యుత్ ఉత్పత్తి పేరుతో దోపిడీ ఆపండి.. శ్రీశైలంలో 854 అడుగుల నీటిమట్టాన్ని కాపాడాలి!**

**రాయలసీమకు శాస్త్రీయ జల నిర్వహణ ఏది? త్రాగునీటి సంక్షోభం, ఎండిపోతున్న పంటలు, పశువులను రక్షించండి!**

**నీటి విడుదలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రైతాంగ ఉద్యమం ఉధృతం చేస్తాం.**

**రాయలసీమ సాగునీటి సాధన సమితి**






**నంద్యాల ఆగస్టు 5 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాలలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఇరిగేషన్ ఇంజనీర్లకు ముఖ్యమంత్రి గారి పేరిట వ్రాసిన వినతిపత్రాలను అందచేసిన రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు.

శ్రీశైలం రిజర్వాయర్ నుండి కృష్ణా జలాలను తక్షణమే విడుదల చేసి, రాయలసీమలో తాగునీటి ఎద్దడిని తీర్చడమే కాకుండా ఎండిపోతున్న ఆరుతడి పంటలను, పశు సంపదను రక్షించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, యర్రం శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కెసి కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్ బీసీ పరిధిలోని ఆయకట్టు రైతులతో కలిసి నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్, తెలుగుగంగ, కేసీ కెనాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ( వినతిపత్రం అందజేశారు.

గత వర్షాకాలంలో శ్రీశైలం రిజర్వాయర్‌కు 2,000 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలు వచ్చినప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల జలాశయంలో 'క్యారీ ఓవర్' నిల్వలను సంరక్షించలేకపోయారని రైతు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఫలితంగానే ఈ సంవత్సరం తీవ్రమైన తాగు, సాగునీటి సంక్షోభం ఎదురవుతోందని తెలిపారు. ప్రస్తుతం ఎగువన కర్ణాటక పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి వరద నీరు చేరుతోందని, ఈ తరుణంలో రాయలసీమ ప్రాజెక్టులకు తక్షణమే నీటిని వదలాలని అధికారలకు విజ్ఞప్తి చేశారు.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్ఆర్బీసీ (గా=దీజ), కేసీ కెనాల్, తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులతో అనుసంధానమైన రిజర్వాయర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, గ్రామీణ చెరువులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు వెంటనే నీటిని పంపింగ్ చేసి, దాని పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులను నింపే కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి త్రాగునీటి ఎద్దడిని నివారించాలని కోరారు.

అనంతరం రైతు నాయకులు మాట్లాడుతూ..
పులిచింతల, పట్టిసీమ ఎత్తిపోతల పథకాల వల్ల కృష్ణా డెల్టా అవసరాలను ప్రత్యామ్నాయ వనరుల ద్వారా తీర్చే అవకాశం ఏర్పడినందున, శ్రీశైలం జలాశయంపై పడే ఒత్తిడి తగ్గిందనీ, ఈ పరిస్థితిని రాయలసీమకు శాశ్వత ప్రయోజనంగా మలచి, శ్రీశైలంలో సంరక్షించే ప్రతి నీటి బొట్టునూ రాయలసీమ తాగు, సాగునీటి భద్రతకు వినియోగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
రాయలసీమ ప్రజల చట్టబద్ధమైన జలహక్కులను పరిరక్షిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉత్తర్వులు జారీ చేయాలని, లేనిపక్షంలో రైతాంగం తరపున పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిరైతు సమాఖ్య అధ్యక్షుడు బెక్కం రామసుబ్బారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, కెసి కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు దామోదర్ రెడ్డి, తెలుగుగంగ పరిరక్షణ సమితి నాయకులు సదాశివరెడ్డి, కెసి కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు చిన్న రామకృష్ణారెడ్డి, బంగారు చిన్న కొండన్న, కృష్ణమోహన్ రెడ్డి, పెద్దన్న, భాస్కర్ రెడ్డి, బక్క వుశేని, పిట్టల మదార్ సాబ్, మహిపాల్ రెడ్డి, పట్నం రాముడు, శివరామిరెడ్డి మరియు తెలుగుగంగ, గా=దీజ, కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com